# చరిత్రలో ప్రబంధ పరమేశ్వరుడు



మంథా భానుమతి

# "చరిత్రలో ప్రబంధ పరమేశ్వరుడు"

## 1

శ్రీమన్నారాయణుడు క్షీరసాగరముపై, శేషతల్పమున శయనించి చిదానంద రూపుడై సృష్టి వైచిత్ర్యాలను పరికిస్తున్నాడు. మూలకారణంబొక్కడే అయినా అనేకానేక రూపాలు.

విఘ్నేశ్వరుడు.. అనంతుడు, అచ్యుతుడు, చతుర్ముఖుడు, ముక్కంటి, ఆదిశక్తి, నాగేంద్రుడు, ఆంజనేయుడు, హయగ్రీవుడు..

హిందూ మతంలోనే ఇన్నిన్ని రూపాలుంటే మరి ఇతర మతాల మాటేమిటి..

ఏకకణ జీవిని సృష్టించాడు.. అదే చేతితో మనిషిని సృష్టించాడు.

మనిషిలో దూరే సూక్ష్మ జీవులనీ, మనిషి మీద పడే క్రూర జంతువులనీ సృష్టించాడు.

అది సరే.. మనిషి మనిషికీ మధ్య ఇంతటి విభేదాలనెందుకు సృష్టించాడో..

కక్షలు కార్పణ్యాలు, కాంక్షలు వాంఛలు

అధికార దాహాలు.. పోనీ.. అదో ఆట అనుకుందాం..

మరి మతం అంటూ తనకి తనే వేరు పరచుకున్నాడే.. ఆ మాటేమిటి? మతం పేరుతో మారణహోమాలు..

మాధవుడు దేవుడంటే.. కాదు శివుడే దేవుడు..

జైన తీర్థంకరులు, బౌద్ధారామాలు..

కాదు కాదు అల్లానే దైవం..

కక్షలు, కార్పణ్యాలు..

అశ్వమేధం, నరమేధం.. అంతులేని పోరాటం. ఎందుకని.. చివరికి ఏం సాధించాలని?

లయ కారణంబునకా..

పోరాటాల మధ్య విరామానికి కాబోలు.. మానసికోల్లాసమునకై వెలసిన సంగీత సుమాలు, సాహిత్య

సౌరభాలు.

అన్నీ ఆ పరమాత్ముడికే చెల్లు.

పాకనాడు (నేటి ప్రకాశం జిల్లా) లోని గుడ్లూరు గ్రామం... క్రీ.శ.13 వ శతాబ్దం ఉత్తరార్ధంలో.. మన్నేరు నది ఒడ్డునున్న ఈ గ్రామం లో నూరు పైన గుళ్లున్నాయి. అందువలననే ఆ గ్రామానికి ఆ పేరు స్థిర పడింది.. వానిలో నీలకంఠేశ్వర స్వామి గుడి బహు ప్రఖ్యాతి చెందింది.

అంతే సమానమైన ప్రాముఖ్యత సంతరించుకున్న కేశవ పెరుమాళ్ ఆలయంలో నారాయణుడు అత్యంత వైభవంతో పూజలందుకుంటున్నాడు.. శివ కేశవులిరువురూ ఆ గ్రామాన్ని తమ రక్షణలోనికి తీసుకున్నట్లు వెలిశారు.

పలు రకాల పండుగలకు, సాహిత్య సంగీత సభలకు ఆలవాలమయింది ఆ సీమ. పామర జనాలు, బంగారపు తొడుగు గల గ్రామదేవత పోలేరమ్మను ఆరాధిస్తూ ఉంటారు.

ప్రతాప వీరాంజనేయ స్వామి గుడి, చెన్నకేశ్వరాలయం, వినాయకుడి గుడి, వీరభద్రుని ఆలయం.. అక్కడున్న ఆలయాల్లో కొన్ని. ఆ పరబ్రహ్మ అన్ని రూపాల్లోనూ కొలువై ఉన్నాడు.

నీలకంఠేశ్వర స్వామి ఆలయంలోని లింగం సగం తెలుపు రంగులో, సగం ఎరుపు రంగులో ఉంటుంది. ఇతిహాసం ప్రకారం దీనికొక కథ ఉంది.

స్వామి సర్ప రూపంలో ఒకానొక ఆవుల మందలోని గోక్షీరం రోజూ తాగేస్తూ ఉండే వాడట. ఆ ఆవు ప్రతీ దినం మందలోంచి తప్పించుకుని, కడుపారా స్వామికి పాలు తావించి వెళ్లేదట. ఖాళీగా వేళ్లాడుతున్న పొదుగును చూసి యజమాని కాపరిని కోప్పడేవాడు.

కొన్ని రోజులు చూసి, ఆ పశువుల కాపరి కాపు కాచి, ఆ పాముని కర్రతో కొట్టాడట. ఆ దెబ్బకి కారిన రక్తంతో ఒక పక్క ఎరుపు, ఆవు పొదుగు నుండి కారిన పాలతో ఇంకొక పక్క తెలుపు వచ్చాయని అంటారు. ఆ లింగాన్ని చూసి కాపరి పశ్చాత్తాపంతో స్వామిని వేడుకున్నాడట.

భోళా శంకరుడు కదా.. కరుణించి కాపరిని కాపాడాడు.

నిజమైన ప్రాయశ్చిత్తంతో వేడుకుంటే ఆ గరళ కంఠుడు పాపాలను తొలగించి, కష్టాలను తీరుస్తాడని ప్రతీతి.

ఇన్నిన్ని గుడులు ఏర్పడక ముందు ఈ ఊరిని 'నేత్రపురి' అని పిలిచేవారు.

శైవ, వైష్ణవ సాంప్రదాయాలకు సమాన ప్రాధాన్యత నిచ్చు సహన శీలురు, విశాల హృదయులు అయిన

గుడ్లూరు గ్రామస్థుల ఖ్యాతి వాడవాడలా వ్యాపించింది. నూరు  ఆలయాలే కాక నూరు తటాకాలు కూడా ఉన్న గుడ్లూరు.. సహజ వనరులతో అలరారుతూ, పాడి పంటలు సమృద్ధిగా ఉండి.. చతుర్వర్ణాలవారు సౌఖ్యంతో మెలిగే ఆదర్శ ప్రదేశం అని పేరు పొందింది.

పదమూడవ శతాబ్దంలో.. గణపతి దేవుడు, అతని తదుపరి రుద్రమదేవి, రాజ్యమేలిన కాకతీయ సామ్రాజ్యపు అధీనంలోనున్న.. అద్దంకి సీమకి చెందిన ఈ ప్రాంతాన్ని పంట వంశ నాయంకరంలోని రెడ్లు ప్రజా రంజకంగా పరిపాలిస్తూ ఉండే వారు.

సామంతులయినా.. తమ తమ స్వాభిమానాన్ని కాపాడుకుంటూ, నీటి వనరులను చెరువులుగా భద్రపరచి రాజ్యాన్ని సస్య శ్యామలం చేశారు.

ఆహార కొరత లేనప్పుడు సహజంగానే సాహిత్య సంగీతాల మీద, కళల మీద ఆసక్తి పెరుగుతుంది. అందునా.. సుస్థిరమైన సామ్రాజ్యం. శత్రువులెవరైనా దాడి చేసినా ఏకశిలానగరం ఏలికలు కొండంత అండగా ఉండనే ఉన్నారు. ఇంక ఏ లోటు ఉండలేదు.. అందుకనే ఆదర్శ సీమ అయింది.

రెడ్డిరాజుల గజ సంపద చక్రవర్తికి స్థైర్యాన్ని, ధైర్యాన్ని కూడ ఒసగి వారిరువురి మైత్రికి దోహదం చేశాయి. సరిహద్దులోనున్న పెద్ద చెరువును కోటలోని ఏనుగుల దాహానికి, స్నానానికి వాడుతూ.. ఏనుగుల దొరువు అని పిలుస్తారు.

ఆ సమయంలో అక్షరానికి కొరతయిందా సీమలో..

అంటే అక్షరాభ్యాసం చేయించడానికి కాదు..

ఛందో వ్యాకరణాలు సాంగోపాంగంగా నేర్పించడానికి, ఉభయభాషల్లోనూ ప్రావీణ్యత గలిగి విద్యార్థులను వేదవేదాంతాలలో నిష్ణాతులను చెయ్యగల గురువు కావాలి.. తెలుగులో కావ్యరచన చేయగలిగే స్థాయికి చేరుకునేలా అభ్యాసములు చేయించే వారు కావాలి.

నీలకంఠేశ్వర స్వామి ఆలయపూజారి నారసింహాచారి కాలధర్మం చెయ్యడంతో ఏర్పడిందా లోటు. రెడ్డి ప్రభువు ఆ లోటు పూడ్చే ప్రయత్నంలోనే ఉన్నాడు.

గుడ్లూరునకు సుమారు ఇరవై యోజనములు ఉత్తరాన.. కృష్ణా, గోదావరీ నదుల మధ్యనున్న వేగినాడులోని కరాపర్తి గ్రామంలో..

నాలుగంకణాల విశాలమైన ఎత్తరుగుల ఇల్లు. ఇంటి ముందు వేప చెట్టు చల్లని నీడ నిస్తోంది. సూర్యోదయాత్పూర్వమే ఆ గృహంలో కలకలం మొదలయింది.

ఇంటి కోడలు పొత్తమాంబ, వీధి వాకిలి ఈ చివర్నుంచాచివరికి తుడిచి, కళ్లాపు జల్లి, రంగవల్లులు తీర్చి దిద్దింది. గృహస్థు గడప దాటక ముందే ముగ్గు వేసెయ్యాలి.. అదే సంప్రదాయం.
వెనువెంటనే యజమాని ఎఱ్ఱపోతసూరి పెద్ద రాగి చెంబు, అంగవస్త్రం, ఉతికేసిన బట్టలు పట్టుకుని జాగ్రత్తగా ముగ్గు పక్కనుంచి దాటి, ఏటికేసి వెళ్లాడు, భుజాలమీదుగా కొంగు కప్పుకుని, అణకువతో తలవంచుకుని నిలబడ్డ కోడలి కేసీ చూసి తల పంకిస్తూ.
దారి పొడవునా కనిపించిన ఊరివారు, వేదకాలం నాటి ఋషి వంటి ఎఱ్రపోతనకి నమస్కరిస్తూ పక్కకి తొలిగారు.
ఎఱ్ఱపోతసూరి ఏటి దగ్గర స్నానమాచరించి, ఎఱ్రని పట్టు వస్త్రం ధరించి, నీరుకావి ఉత్తరీయంతో వక్షస్థలాన్ని కప్పుకుని, రాగి పాత్రలో నీటిని దారిలో చల్లుకుంటూ ఇంటికి వచ్చాడు.
పచ్చని ఛాయ గలవాడేమో.. ఆరీ అరని నీటి బిందువులలో ఉదయార్కుని ఎరుపు రంగు పరావర్తనం చెంది ఆయన మేను ఉషోదయ కాంతులు వెదజల్లుతోంది. సాక్షాత్తూ ఆదిత్యుడే నడచి వస్తున్నాడేమో అని భ్రమ కలుగుతోంది. తలవంచి గవాక్షం లో అడుగు పెడుతూనే నృసింహ స్తోత్రం వల్లించసాగాడు.
"శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే
భోగీంద్ర భోగమణి రక్షిత పుణ్య మూర్తే
యోగీశ శాశ్వత శరణ్య భవాబ్ది పోత
లక్ష్మీ నృసింహ మమ దేహి కరావలంబం."
అప్పటికే తలారా స్నానమాచరించిన అతని ధర్మపత్ని పేరమ్మ, వేలు ముడి వేసుకుని, ఒద్దికైన కాశ కట్టుతో మడి చీర కట్టుకుని తులసి కోట దగ్గర శుభ్రం చేసి ముగ్గు వేసి, దీపం పెట్టేసింది. ఆదిత్య హృదయం చదువుకుంటూ, దేముడి అర తుడిచి, దీపపు సెమ్మెలు, పంచపాత్ర, అరివాణం, ఉద్ధరిణీ మొదలుగాగల పాత్రలను తళతళా తోమి, బోర్లించింది. పొయ్యి వెలిగించి మహా నైవేద్యానికి సిద్ధం చేస్తోంది.
ఎఱ్ఱపోతసూరి కుమారుడు సూరన్న ఉభయ భాషా ప్రవీణుడు. సంస్కృతాంధ్ర భాషల్లోని కవిత్వాలలో ప్రౌఢ శబ్ద ప్రయోగాలతో ఘనుడిగా పేరు పొందాడు. తండ్రికి తగ్గ తనయుడు.. ఆచార వ్యవహార్లోనూ, ఆత్మాభిమానంలోనూ కూడా. కలిమిలోనూ, లేమిలోనూ నిమిత్తమాత్రంగా ఉంటారు ఇరువురూ.
సూరన్న బ్రాహ్మీ ముహూర్తమందే లేచి, పూజాది కార్యక్రమాలు ముగించి.. వీధి అరుగు మీద తన

పాఠశాల తెరిచాడు.

విప్ర బాలురు నమకం, చమకం, పురుష సూక్తం, వ్యాకరణ సూత్రాలూ ఆదిగాగల సంస్కృతాంధ్ర భాషల్లోని పాఠాలను వల్లె వేస్తున్నారు. ఇంకా చిన్న పిల్లలు నల్లని అరుగు మీద తెల్లని ముగ్గు వేసి అందులో అకారాది అక్షరాలను దిద్దుతున్నారు.

సూరన్న భార్య పొత్తమ్మ, తలుపు చాటున నిలిచి, చేతులు కదిపి గాజులు చప్పుడు చేసింది.

ఏదో వ్రాయ నిశ్చయించుకుని తాళపత్రాలు సర్దుకుంటున్న సూరన్న లేచి లోనికేగాడు.

పొత్తమ్మ ఇరువది ఏండ్ల ముగ్ధ. విశాలమైన కనుదోయి.. తీరైన నాసిక, నిరంతరం చిరునవ్వు నవ్వుతున్నట్లు అనిపించే పెదవులు.. కావ్య నాయిక వలెనే ఉంటుంది. జుట్టు తడి ఇంకా ఆరలేదేమో.. విరబోసుకుని, చివర వేలుముడి వేసింది. వంకీలు తిరిగిన ముంగురులు నుదుటి మీద అల్లల్లాడుతుండగా, సిగ్గుతో కను రెప్పలు వాల్చి మట్టి పాత్రలో గోరువెచ్చని పాలు అందించింది.

ప్రసన్న వదనంతో క్షీర పాత్రని అందుకున్నాడు సూరన్న.

"మరీ.." సన్నని స్వరంతో ఏదో చెప్పబోయింది పొత్తమ్మ.

కనుబొమ్మలెగరేశాడు పతిదేవుడు.

"కోమటి జంగన్న అంగడికి వెళ్లి వస్తారా? ఇంటిలో వస్తువులన్నీ నిండుకున్నాయి. కట్టెలు కూడా.."

సగం సగం మాటలు మింగేసింది సంశయాత్మకంగా చూస్తూ.

చెప్పవచ్చునో లేదో.. చెప్పకున్న రాత్రికి పొయ్యి రాజేసే పని లేదు. అప్పటి దాకా అన్ని విషయాలూ అత్తగారు, మామగారూ చూసుకునేవారు.

సూరన్న అయోమయంగా చూశాడు. ఇల్లు, వస్తువులు.. అవన్నీ తను.. ఏ విధంగా.. ఏం చెయ్యాలో తెలియదే! తండ్రిగారు ఏమీ చెప్పలేదే! ఉన్నట్లుండి వంట సామగ్రి అంటే ఎక్కడికి వెళ్లాలి.. వీటన్నింటికీ ద్రవ్యం ఎక్కడనుంచి వస్తుంది..

తల తడుముకుంటూ వీధి అరుగు మీదికి వెళ్లాడు.

నిశ్చింతగా కాలం గడుపుతున్న సూరన్న ఒక్కసారిగా కొండంత భారం శిరమున ఎత్తుకుంటున్నట్లు, హఠాత్తుగా సమస్యల సర్పాలు చుట్టుముట్టినట్లు విలవిల్లాడిపోయాడు.

అన్యమనస్కంగానే పిల్లలకి పాఠాలు నేర్పాడు.

"కోడలు చెప్పింది నిజమే అబ్బాయీ! మీ తాతగారి తండ్రి భీమన గారు వెలనాటి చోడుల వద్ద మంత్రిగా ఉండే వారు. ఆ రాజులకి అత్యవసర సమయంలో అమూల్యమైన సలహాలందించి మంచి పేరు తెచ్చుకున్నారు. వారికి రాజులు ఇచ్చిన మడిమాన్యాలతో ఇన్ని తరాలు గడిచాయి. పుత్ర పౌత్రాభివృద్ధి అయి వంశం శాఖోపశాఖలుగా విస్తరించింది. కూర్చుని తింటే కొండలయినా కరిగిపోతాయి.

మన విషయంలో అదే అయింది. దానికి తోడు కఱవు.. కౌలుకిచ్చిన భూమి మీద ఏమాత్రం రూకలు రావట్లేదు. రూకలు లేకున్న నూకలెక్కడ్నుంచి వస్తాయి మరీ! మీ తండ్రిగారు వృద్ధులవుతున్న సంగతి చూస్తున్నావు కదా!" పేరమ్మ ఎప్పట్నుంచో కొడుక్కి చెప్పాలనుకుంటున్న మాటలన్నీ కష్టపడి చెప్పేసింది.

బాధ్యత అప్పచెప్పడం ఇంతటి భారమైన పనని అనుకోలేదు. తండ్రి నుంచి తనయుడికి ఆస్థి సంక్రమిస్తే ఆనందమే కానీ..

ఆదాయం లేకుండా ఇల్లు నడపమనడం అన్యాయమే! కానీ అనివార్యం.

సూరన్న అటూ ఇటూ చూశాడు ఆధారం కోసం.

ఎఱ్ఱపోతసూరి మాట్లాడకుండా ఔపోసన పట్టాడు.

తండ్రీకొడుకులిద్దరూ నట్టింట్లో భోజనాలకి కూర్చున్నారు. పెరటి తోటలో కోసిన బచ్చలి కూర పులుసు, జొన్న సంకటి వడ్డించింది పేరమ్మ. సూరన్న సరిగ్గా గమనించడం లేదు కానీ.. గత ఆరు మాసాలుగా ఆధరువులు అరకొరగానే ఉంటున్నాయి.

"మరి ఇంత కాలం నాదృష్టికి ఎందుకు తీసుకొని రాలేదమ్మా?" జొన్నసంకటిలో పులుసు కలిపి నోట పెట్టుకోబోతూ అడిగాడు సూరన్న.

"నువ్వు గురుకులం వెళ్లి విద్య నభ్యసించడం.. ఆ తరువాత వివాహం.. ఇప్పుడిప్పుడే కదా ఇంటి పట్టున ఉంటున్నది.."

"ఏదో నడిపించినంత కాలం నడిచింది. ఇప్పుడు ఋణ బారం ఎక్కువయింది. వర్షాలు పడితే అంతా సర్దుకునేదేమో! మూడు సంవత్సరాలుగా వరుణుడి కరుణ లేదు కదా.. ఇంక ఇప్పుడు మనం ఏదో ఒకటి చెయ్యకపోతే ఊర్లో ఉండలేం. అదీ అత్యంత త్వరితంగా." ఎఱ్ఱపోతసూరి నోరు విప్పాడు.

నిజమే.. తాను ఇంక గృహ బాధ్యతలు స్వీకరించక తప్పదు. తల్లిదండ్రులని మానసికంగా, భౌతికంగా

సుఖపెట్టడం తన బాధ్యత. సూరన్న ఆలోచిస్తూ భోజనం పూర్తి చేశాడు.

తను నమ్ముకున్న ఆ చంద్రశేఖరుడు ఏదో దారి చూపించకపోతాడా..

చూపిస్తాడు. చూపించబోతున్నాడు..

తండ్రీ కొడుకులిరువురూ లేచి, పెరటి అరుగు మీద చేతులు కడుక్కుంటుండగా వినిపించింది ఒక కేక.

"అయ్యా! సూరన్నగారి గృహమిదేనా?"

సూరన్న జరీ కండువా తీసుకుని, వక్షస్థలం కప్పుకోబోయాడు. రెండు పెద్ద పెద్ద చిరుగులు.. అప్పుడు దర్శనమిచ్చాయి, తమ స్థితిగతులను సూచిస్తూ. విద్యాభ్యాసం.. వివాహం, వీటి ధ్యాసలో పడి పట్టించుకొనే సమయం లేక.. ఏదీ గమనించలేదు. గట్టిగా నిట్టూర్పు విడిచాడు.

ఇంక విచారించి ఏం లాభం.. ఏదో చెయ్యవలసిందే కానీ!

మూడు తరాల ముందటి మహరాజు మెచ్చి ఇచ్చిన మణులు మడి మాన్యాలు మాయమై పోయాయి..

మడి కట్టుకుని కూర్చుంటే మనుగడ సాగేదెలా

ముందుకు సాగి మేధకి పదును పెట్టాలి మరి.

తనకి తనే ధైర్యం చెప్పుకుని, కష్టపడి కండువా చిరుగులు కనిపించకుండా సర్ది, వీధి వాకిలి తీశాడు.

ఇద్దరు భటులు..

సూరన్న రాక చూసి, శిరస్త్రాణాలు తీసి ప్రక్కనున్నఅరుగు మీదనుంచి నమస్కరించారు.

"స్వామీ! అద్దంకినాయంకరానికి చెందిన పంటవంశపు రెడ్డి ప్రభువులు తమకు వర్తమానం అంపారు. మీ సమాధానం విని తగిన ఏర్పాట్లు చేస్తామన్నారు." నడుముకి కట్టిన సంచీ తీసి, అందు భద్రపరచిన లేఖని ఇచ్చాడు ముందుకు వచ్చిన ఒక సైనికుడు.

లేఖ అందుకుని, భృకుటి ముడిచి చదవసాగాడు సూరన్న.

"ఎవరదీ.. ఏ పని మీద వచ్చారూ?" ఎఱ్ఱపోతసూరి నెమ్మదిగా వచ్చి స్థంబానికి ఆనుకుని నిలిచి అడిగాడు.

"అద్దంకి నుండి వర్తమానం తండ్రీ! రెడ్డి ప్రభువులు నన్ను గుడ్లూరులోని నీలకంతేశ్వరాలయం చూసుకుంటూ, అక్కడ పాఠశాలని ప్రారంభించమని అడుగుతున్నారు. అచ్చటి ప్రధాన అర్చకునికి వారసులు లేరట. ఆయన నా పేరు సూచించి మరణించారట. మా గురువుగారు, ఆయన మంచి

స్నేహితులు. ఏం చేద్దామంటారు?"
"ఆ నీలకంఠుడే పిలుస్తుంటే కాదనడానికి మన మెవరం.. సరైన సమయంలో నేనున్నానని చూపించాడు. పరమేశ్వరుని ఆజ్ఞ.. పైగా రెడ్డి ప్రభువులు సాహిత్యాభిలాషులనీ, సామాన్యులని కూడా అక్షరాసక్తులని చెయ్యాలని కంకణం కట్టుకున్నారనీ విన్నాను. మనం ఆలోచించ వలసిన పనే లేదు."

..................

# 2

వాకిట మేనాలు సిద్ధంగా ఉన్నాయి.
పేరమ్మ ఇల్లంతా తిరుగుతూ, గవాక్షాలన్నీ తడుముతూ విచారంగా పెరటి తోటలోని వృక్షాలనీ, పక్షుల్నీ పేరు పేరునా పలుకరిస్తోంది. ఇరువది ఐదు వత్సరాలుగా ఆ ఇంటితో నున్న అనుబంధం..
"అమ్మా! మమ్మల్ని చల్లగా కాపాడావు. ఇప్పటి వరకూ ఏనాడూ పస్తు పడుక్కునే స్థితి రాకుండా చూసుకున్నావు. నీకు దూరమవుతున్నా.. నిరంతరం నిన్ను స్మరిస్తూనే ఉంటా తల్లీ.. కరుణ చూపు.."
తను నిత్యం పూజించే తులసి కోట దగ్గర నిలిచి కన్నులు మూసుకుంది.
ఎఱ్ఱపోతసూరి తనకి అత్యంత ప్రియమైన మామిడి చెట్టును వదిలి రాలేకపోతున్నాడు. తనకి మూడు సంవత్సరాల వయసప్పుడు.. తాతగారు భీమన మంత్రి రాజుగారి తోటనుండి తెచ్చిన చిన్న మొక్కని పాతారు. చిన్ని చిన్ని చేతులతో దానికి కొప్పులు తవ్వి, నీళ్లు పోసి, తనతో ఆ చెట్టు కూడా పెరుగుతూ ఉంటే.. చిగురాకులు వేసినప్పుడల్లా తామందరూ ఎగిరి గంతులేస్తూ.. ఎన్నెన్ని జ్ఞాపకాలు?
ఆ తరువాత అది మహా వృక్షమైనప్పుడు, ఎన్నో శుభ కార్యాలు జరిగాయి ఆ చెట్టు నీడన. ఆ ఇంటి ఆడపడుచులు ఉయ్యాలలు ఊగుతూ పాడిన పాటలు ఇంకా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.
ప్రతీ పండుగకీ మామిడి తోరణాలు, వేసంగుల్లో ఊరగాయలు.. మామిడికాయ పప్పుతో వరి అన్నం, పురిషిడు నెయ్యి వేసుకుని తింటే.. ఆ రుచి ఏ పంచ భక్ష్య పరమాన్నాలకి సాటి?
"ఈ వేప చూశారా.. కొమ్మలు ఊగించి మనకి పూస్నానం చేస్తోంది.." గద్గద కంఠస్వరంతో పేరమ్మ అడుగుతుంటే నోట మాట రాక తలూపారు ఎరపోతసూరి.
"అమ్మా! మనం ఇంక సాగాలి.. సంధ్యా సమయానికి రెండు యోజనములు పైగా వెళ్లాలి. అక్కడే

మనకి రేయి గడపడానికి వసతి ఉంది. మీరు ఇచ్చోటు వదిలి రావడం కష్టమే.. కానీ మనకి సమయానికి మంచి అవకాశం కల్పించాడు ఆ పరమేశ్వరుడు. లేకున్న కొద్ది రోజులలో పస్తులు తప్పేవి కాదు కదా. మీరు పెద్దవారు.. అనుభవజ్ఞులు. మీకు చెప్పేటంతటి వాడిని కాను.." సూరన్న రెండు చేతులతో తల్లిదండ్రులిద్దరినీ తోడ్కొని వెళ్లి మేనా ఎక్కించాడు.

తిరు చందనం నామం పెట్టుకొన్న ఎల్లపోతసూరి సాక్షాత్తూ విష్ణుని వలే ఉన్నాడు. ఇంక పేరమ్మ.. ఎర్రని పట్టు చీర కట్టి, అడ్డబాస మెరుస్తుండగా, నల్లపూసలు నిగనిగలాడుతూ పవిత్ర భావాన్ని కలిగిస్తుంటే లక్ష్మీదేవికి ప్రతి వలే ఉంది. నడవలేక నడవలేక నడిచి, మేనా ఎక్కారు ఇరువురూ. మెత్తని బూరుగు దూది పరుపులమర్చిన మేనా సౌకర్యంగా ఉంది.

ముందు నున్న మేనాలో భార్యని ఎక్కించి.. తాను కొంత దూరం వెనుక నడుస్తానని చెప్పాడు సూరన్న. ఇంట నున్న సామాన్లు ఏవీ తీసుకొని రావద్దనీ, వీరికి సకల సౌకర్యాలూ కలుగ జేశామని చెప్పమన్నారని అన్నారు.. రాజుగారు పంపిన భటులు.

అయినా.. ఇంటిలో సామాన్లు ఏమున్నాయని.. మట్టి కుండలు తప్ప.

సామాన్లు ఒక్కొక్కటీ ఏనాడో తాకట్టుకి కట్టుగా వేంచేశాయి. సంభారాలా.. ఏ పూటకాపూటే.. దారిలో మార్చుకొనుటకు మాత్రం తలకొక రెండు జతలు బట్టలు మూటలు కింద కట్టి, మేనాలో పెట్టుకున్నారు.

"ఒక్కనిముషం.." ఎల్లపోతసూరి మేనా దిగి ఇంటిలోనికి వెళ్లాడు.

సూరన్న అసహనంగా అటూ ఇటూ తచ్చాడుతున్నాడు. మనసులో కూడా పితృదేవుని చిన్న చూపు చూడని మనస్తత్వం.. జన్మతహా వచ్చిన సంస్కారం.

"చూశావా సూరీ. అనుకుంటూనే ఉన్నా.. నా పంచాయతనం మరచిపోతానని. ఆ విధంగానే.." భద్రంగా పట్టుబట్టలో చుట్టిన పంచాయతనాన్ని, పూజ గృహంలోనుంచి తీసుకొస్తూ అన్నాడు ఎల్లన్న, వణుకుతున్న కంఠంతో.

తండ్రిని మేనా ఎక్కించి, తాను బోయీలతో నడుస్తానన్నాడు సూరన్న. వేరొకరు మోస్తుంటే తాను కూర్చొనడమా! శక్తి ఉంది కదా.. తన వంతుగా కొద్ది భారము తగ్గించిననూ నయమే కదా!

మేనాలు తీసుకొని వెళ్లే బోయీలు కాక నలువురు భటులు.. ఒక అధికారి ఉన్నారు. త్రోవలో భోజన, విశ్రాంత్యాది కార్యక్రమాలకి కూడా అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు.

రాజు గారు తలచుకుంటే దేనికి కొదవ..
అచ్చట గుమికూడిన ఊరివారందరికీ కన్నీటితో వీడ్కోలు చెప్పారు నలువురూ.
వేచి ఉన్న శ్రేష్ఠి గారికి ఇంటి తాళం అప్పజెప్పి, తాము ఋణపడిన వారి పట్టిక ఇచ్చారు సూరన్న, ఎఱ్ఱపోత సూరి.
ఊరి పొలిమేర వరకూ వచ్చి సాగనంపారు కరాపర్తి గ్రామ వాస్తవ్యులు.. కన్నుల ప్రవహిస్తున్న నీరు ఆపుకునే ప్రయత్నం చెయ్యలేదు ఎవరూ. మూడు తరాల అనుబంధం.
తమ శరీరాల్లో ఒక భాగాన్ని వదిలి వేస్తున్నట్లు అనిపించింది ఆ కుటుంబీకులకి.
అందరికీ అన్నన్ని బోధలు చేశాడు కానీ సూరన్న కన్నులు చెమరుస్తూనే ఉన్నాయి. వెనుతిరిగి చూసుకుంటూ అడుగులు వేస్తున్నాడు. ప్రతీ చెట్టూ, ప్రతీ పుట్టా వీడ్కోలు చెప్తున్నట్లే ఉంది.
అదిగో ఆ వేప చెట్ల మీదనే కదా మిత్రులతో కోతి కొమ్మచ్చి ఆడింది..
ఈ రావి చెట్టుకిందనే మొదటి గురువు అక్షరాలు దిద్దించింది.
అరే.. తాము ఈత కొట్టిన దిగుడుబావి. ఒక్క చుక్క నీరు లేదు. పిచ్చి మొక్కలు మొలిచి దీనంగా చూస్తోంది. అడుగు ముందుకు పడనని మొరాయిస్తోంది శరీరం.
"అయ్యోరూ! మీరు మేనా ఎక్కండి. మాకంటే అలవాటే. పైగా మేం మజిలీ మజిలీకీ మారుతాం. మీకు ఎదర చేకొనే కార్యాలు చాలా ఉంటయ్యి." బోయీల పెద్ద అనునయించగా సూరన్న భార్య కూర్చున్న మేనా ఎక్కాడు.
భటులంతా అశ్వారూఢులై ముందు ఇరువురు, వెనుక ముప్వురు సాగుతున్నారు. సూరన్న ఎక్కగానే వేగం పెంచి పరుగందుకున్నారు బోయీలు. అప్పుడు.. అర్థమయింది సూరన్నకి తను చేసిన తప్పు.. తన వలననే వేగం తగ్గింది అంత వరకూ.
పోతమాంబ భర్త చెయ్యి పట్టుకుంది అనునయిస్తూ.. ధైర్యం చెప్తూ.
"నిక్కము నిక్కము, నిక్కము..
ప్రక్కా తోడూ, ఊరూ వాడా..
ఎవరూ, ఏదీ నీ వెంట రాదు.
మధ్య మజిలీలకి మేమున్నామన్నా
చిట్ట చివరి మజిలీకి

ఒంటరి పయనం తప్పదన్నా.

ఒహోం.. ఒహోం హోం ఒహోం ఒహోం..

నాలుగు రోజులున్నా

నలుగురికీ మేలు చెయ్యాలన్నా

పదుగురి మెప్పు పొందాలన్నా

పదికాలాలు నీ మంచే తలవాలన్నా.

ఒహోం.. ఒహోం హోం ఒహోం ఒహోం.."

బోయీలు పాటందుకున్నారు. తన చేత కాని పరిస్థితులలో వేదాంతం తప్పదు ఎవరికైనా.. సూరన్న విరక్తిగా నవ్వుకున్నాడు.

మధ్యాహ్న కాలం వరకూ అవిశ్రాంతగా సాగి, అప్పుడు.. దట్టంగా చెట్లున్న చోట ఆగారు. బోయీలు మేనాలు ఆపి కిందికి దింపారు. మేనా దిగిన ఎఱ్ఱపోతన దంపతులు, సూరన్న, పోత్తమ్మ కాళ్లు చేతులు సాగదీసుకుని, చెట్ల చాటునకు వెళ్లి అవసరాలు తీర్చుకుని, నీడన చాపలు పరిచి విశ్రాంతిగా కూర్చున్నారు.

అక్కడికి దగ్గరలోనే ఏరు ఉంది. చల్లని నీటితో ముఖము కడుగుకొనగానే సుఖంగా అనిపించింది అందరికీ. మలయమారుతం సేద తీరుస్తోంది.

రౌతులు, గుఱ్ఱాలను చెట్లకి కట్టేసి, మాలీషు చెయ్యసాగారు. అశ్వాలకి కడుపు నిండుగా తిండి పెడ్తే సరిపోదు. ఆప్యాయత కూడా కావాలి. గుగ్గిళ్లు పెడుతూ, వాటితో సంభాషణలు జరుపుతుంటే ఆశ్చర్యంగా చూసింది పోత్తమాంబ.

"మానవులకంటే అభిమానం ఎక్కువ తురగాలకి. తమ యజమాని కోసం ప్రాణాలివ్వడానికి కూడా వెనుకాడవు. రౌతుకి దెబ్బ తగిలి పడిపోతే, క్షేమంగా ఇంటికి చేరుస్తాయి. అంతే ఆప్యాయతని ఆశిస్తాయి కూడా.. ఉదాసీనంగా ఉంటే కదలమంటూ మొరాయిస్తాయి" సూరన్న వివరించాడు.

పెద్ద పెద్ద ఆకులు తీసుకుని, అందులో నాలుగు రకాల ఫలాలు పెట్టి ఎఱ్ఱపోతన్న, సూరన్నాదులకి అందించారు భటులు. వెదురు బూరాల్లో మంచి తీర్థం ఉండనే ఉంది.

"స్వామీ! మీరు ఫలములు ఆరగించి కొద్ది సేపు విశ్రాంతి తీసుకుంటే మనం సంధ్యవేళకి ఒక పల్లె చేరుతాము. అచ్చట అర్ఘ్యపాదాది అనుష్ఠానం అయిన పిదప, మీకు బ్రాహ్మణ సత్రంలో భోజన వసతి

చేయించాము."

పేరమ్మ, తనూ కోడలూ నాలుగు రోజులుగా కూర్చుని చేసిన భక్ష్యాలు, అరిసెలు, వేయించిన అటుకులు, వేపుడు బియ్యం.. కొద్ది కొద్దిగా అందరికీ పెట్టింది. చుట్టు ప్రక్కల ఉన్న ఆడవాళ్ళు కూడా వచ్చి సహాయం చేశారు..

పిండి దంచడంలో, జల్లెడ పట్టడంలో.. అరిసెలు వత్తడంలో.

అత్తా, కోడలు వాటన్నింటినీ ప్రత్యేకంగా బాదం ఆకుల్లో, అరటి ఆకుల్లో భద్రంగా చుట్టి.. పరిశుభ్రమైన వస్త్రాలతో మూటలు కట్టారు. అవి వారి వెంటే ఉంటాయి.

"అమ్మగారూ! ఈ ఫలారాలు ఇకనుంచీ మాకు పెట్టద్దమ్మా! మేం తెచ్చుకున్నవే ఉన్నాయి. అవి మీరు తినరు కదా.. రెండువారాలు పడుతుంది మనం మన ఊరు చేరే సరికి. అప్పటి వరకూ జాగరూకతతో వాడుకోవాలి కదా!" అధికారి, నరసింహ సేనాని అన్నాడు.

పేరమ్మ ప్రసన్నంగా చూసింది.

"ఈ పూటకి తినండి బాబూ.. కష్టపడుతున్నారు."

"మాకు ఈ పయనం నల్లేరు మీది నడకేనమ్మా! గంగా తీరం వరకూ తెలియని త్రోవల వెంట వెళ్లిన వాళ్లం. దారి వెంట పురుగు, పుట్ర.. దొంగలు, క్రూర జంతువులు.. ఒకటేమిటి.. ఎన్నో అడ్డంకులు. అన్నింటినీ అధిగమించి సాగవలసిందే." నరసింహుడు వినమ్రంగా అన్నాడు.

పోతమ్మ మాత్రం కొంగు భుజాల చుట్టూ కప్పుకుని, తల దించుకుని వినయంగా కూర్చునుండిపోయింది. మామగారు, భర్త ఎదురుగా ఉండగా ఏ విధంగా భక్షించాలి.. సంప్రదాయం కాదు కదా!

"అమ్మా! ఈ కానలో కోనలో.. ఏ సంకోచం వలదు. మేం నీ తల్లిదండ్రులం. తీసుకో తల్లీ.." ఎఱ్ఱపోతన్న అభిమానంగా చూస్తూ అన్నాడు.

ఆప్యాయతకీ, ప్రేమాభిమానాలకీ ప్రతీకలైనట్లున్న ఆకుటుంబాన్ని ముచ్చటగా చూశారు అచ్చటనున్న బోయీలు, భటులూ.

రెండురోజులు పయనం తరువాత కృష్ణా తీరం చేరారు.

ఇంద్రకీలాద్రి పర్వతం..

అర్జునుడు పరమేశ్వరుని మెప్పించి పాశుపతాస్త్రాన్ని సాధించిన ప్రదేశం. విజయుని పేరుమీదుగా

విజయవాడ అనే పేరును సార్ధకం చేసుకొన్న పట్టణం. అచ్చట ఒకరోజు విశ్రాంతి అనీ.. బోయీలు మారుతారనీ నరసింహుడు చెప్పాడు.
శివభక్తుడైన సూరన్న సంతోషానికి అవధిలేదు.
కృష్ణవేణీ నదిలో స్నానమాచరించి, ఇంద్రకీలాద్రి మీద వెలసిన కనకదుర్గమ్మ దర్శనం చేసుకుంటే కామితములన్నీ నెరవేరును కదా! మల్లిఖార్జునస్వామిని సేవిస్తే మరి ఎదురేముండదు కదా! ఎటువంటి అవకాశం దొరికింది.. అంతా ఆ ముక్కంటి దయ. తాము తీర్థ యాత్రలు చెయ్యడానికే ఈ విధంగా జరిగిందేమో!
ప్రభువులు ఏర్పాటు చేసిన విడిది ఇల్లు ఒక బ్రాహ్మణ సత్రము. అచ్చట నియోగింపడిన బ్రాహ్మణుడు ఆదరంతో పలుకరించి వసతి చూపించాడు.
ఒకప్పుడు ఆ ప్రదేశంలో రాక్షసుల బాధ అధికంగా ఉండేదట.. అప్పుడు ఇంద్రకీలుడనే ఋషి తపస్సు చేసి కనకదుర్గమ్మని మెప్పించి, తన శిరము మీద వసించి ప్రజలని రక్షించి కాపాడమని అడిగాడుట. అదే ఇంద్రకీలాద్రి పర్వతం అని ఒక పురాణ గాధ తెలుపుతుంది.
భక్తుని కోరిక మన్నించి దుర్గమ్మతల్లి అక్కడ నివాసం ఏర్పరచుకుందని ప్రజల నమ్మకం.
సూరన్న తెలతెల వారుతుండగా అందరినీ లేపేశాడు. కృష్ణానదిలో స్నానం, అమ్మవారి దర్శనం, మల్లిఖార్జున స్వామికి అభిషేకం.. పిదప పరిసరాలన్నింటిని పరికించి చూస్తూ, మనసారా ఆనందిస్తూ కొండ దిగుతున్నారు.
ఎన్నెన్నో వృక్షాలు.. వాటినల్లుకుని రంగు రంగుల పువ్వులతో నిండిన తీవెలు..
ఓహ్.. ఏమి అందాలు..
మల్లెలు మొల్లలు మామిళ్లనల్లి హొయలుపోగా
అల్లన మెల్లన వాయు వీచోపుల్ హాయి గొలుపగా
ఘల్లు ఘల్లున పోతమాంబ అందెలు రంజిల్లుతూ మ్రోగగా
మెల్లగ చనిరి మున్ముందుకు ఎరపోతసూరనాదులు.

మరునాడు కృష్ణానది దాటాలి. మేనాలూ, బోయీలూ కిట్టమ్మకీవల ఒడ్డునే ఆగిపోయారు. బోయీలు పేరు పేరునా వీడ్కోలు చెప్పారు.
"అయ్యవారూ! మీతో గడిపిన ఈ రెండు దినాలూ క్షణాల్లా గడిచాయండి. అందరూ మీ వలె ఉంటే

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Charitralo+Prabandha+Parameswarudu**

* * *